నీలగిరి నిత్యపద్యం
ఆటవెలది

వాదులాట పెరుగు వాదించుకొన్నచో
చర్చచేసుకొనిన సద్దుమణుగు
కలిసియున్నతోడ కలుగుసుఖమెపుడు
విజయలక్ష్మి వాక్కు వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

# నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 229 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 04-12-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00





## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన
- "కార్పొరేట్ జంగిల్ రాజ్ వద్దు- కార్మికులకు న్యాయం కావాలి" అంటూ ప్రదర్శన
- కార్మిక వ్యతిరేక..కార్పొరేట్ అనుకూల ప్రభుత్వం : మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్లకు అనుకూలంగా మోడీ సర్కార్ తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. బుధవారం పార్లమెంట్ ఆవరణలోని మకరద్వారం ఎదుట కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, డీఎంకే, టీఎంసీ, ఎన్‌సీపీ, ఆర్‌జేడీ, ఎస్‌పీ, ఐయూఎంఎల్ తదితర ప్రతిపక్ష నేతలు ఆందోళన చేపట్టారు. "కార్పొరేట్ జంగిల్ రాజ్ వద్దు- కార్మికులకు న్యాయం కావాలి" అంటూ భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీల నేతలు ప్లకార్డులు చేబూని నినాదాల హౌరెత్తించారు. రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ -మిగతా 2 లో

# మరో 40 వేల ఉద్యోగాలిస్తాం

**ఇప్పటికే 60 వేల పోస్టులు భర్తీ చేశాం**



- ఇదే రోజున దుర్మార్గ పాలన అంతమొందించి..ప్రజా పాలన తెచ్చారు
- కేసీఆర్‌కు హుస్నాబాద్ సెంటిమెంట్ ప్రచారానికే..నిధులివ్వడానికి కాదు
- హుస్నాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- సర్పంచ్ ఎన్నికల్లో మంచోళ్లని ఎన్నుకోవాలంటూ సూచన
- రూ. 262.78 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

-సిద్దిపేట, హుస్నాబాద్ రూరల్ డిసెంబర్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రెండున్నరేండ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి ఆశయ సాధనలో భాగంగా ఇప్పటికే 60వేల పోస్టులు భర్తీ చేశామని, త్వరలో మరో 40వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అన్నారు. 2023 డిసెంబర్ 3న ఓటు అనే ఆయుధంతో దుర్మార్గ పాలనను అంతమొందించి.. ప్రజాపాలనను తీసుకొచ్చారని గుర్తుచేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. -మిగతా 2 లో



## రైతులకు భూధార్ కార్డులు

- స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత పంపిణీ
- పైలట్ ప్రాజెక్టు కింద 5 గ్రామాల ఎంపిక
- జనవరి నాటికి అన్ని ఆప్షన్లతో భూ భారతి కొత్త యాప్
- భూసమస్యలపై ట్రిబ్యునల్ ఏర్పాటు
- సింగిల్ పేజీ డిజిటలైజేషన్‌లో భూరికార్డు, సర్వే, రిజిస్ట్రేషన్
- నాటి మున్సిపల్ మంత్రి ముడుపులు తీసుకుని ల్యాండ్ కన్వర్షన్ : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతులకు భూధార్ కార్డులను పంపిణీ చేస్తామని రెవెన్యూ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. తొలుత నక్షా లేని ఐదు గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామని అన్నారు. ఆ గ్రామాల్లోని రైతులకు భూధార్ కార్డులతోపాటు సరిహద్దులు, కొత్త సర్వేనెంబర్లను కేటాయిస్తామని వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండేండ్లలో రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రజల సౌలభ్యం కోసం విప్లవాత్మక మార్పులను తెచ్చామని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను -మిగతా 2 లో



## ఎనిమిది యుద్ధాలు ఆపా

- భారత్-పాక్ ఒప్పందానికి నేనే కారణం
- ప్రతి యుద్ధానికీ నోబెల్ ఇచ్చి ఉండాల్సింది

వాషింగ్టన్

భారత్-పాకిస్తాన్ మధ్య ఘర్షణను తానే నివారించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి చెప్పుకొచ్చారు. ఎనిమిది యుద్ధాలను నివారించానని అంటూ వాటిలో ప్రతి దానికీ తనకు నోబెల్ శాంతి బహుమతి ఇచ్చి ఉండాల్సిందని అన్నారు. 'మేము ఎనిమిది యుద్ధాలను ఆపాము. మరో యుద్ధాన్ని ఆపబోతున్నాము. నేను అలా అనుకుంటున్నాను. ఆశిస్తున్నాను' అని చెప్పారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రస్తావిస్తూ మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'నేను యుద్ధాన్ని ఆపిన ప్రతిసారీ వారు ఓ మాట చెప్పే వారు. అధ్యక్షుడు ట్రంప్ యుద్ధాన్ని ఆపితే ఆయనకు నోబెల్ బహుమతి వస్తుందని అనే వారు. నేను ఓ యుద్ధాన్ని ఆపినప్పుడు మాత్రం అందుకోసం ఆయనకు నోబెల్ బహుమతి రాదని, మరో యుద్ధాన్ని ఆపితే వస్తుందని చెప్పే వారు' అని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపితే నోబెల్ వస్తుందని ఇప్పుడు -మిగతా 2 లో




## మహానగరంగా ఇక హైదరాబాద్

- జిహెచ్ఎంసిలో 27 మున్సిపాటలిటీల విలీనం
- మున్సిపల్ రికార్డులను స్వాధీనం
- సిబ్బంది వివరాలు తెలియచేయాలని సూచనలు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రత్యేక ఆదేశాలు జారీ

హైదరాబాద్, డిసెంబర్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): :గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో 27 మున్సిపాలిటీల విలీనం పక్రియ వేగవంతం అయింది. ఇప్పటికే ప్రభుత్వం పంపిన ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ప్రత్యేక ఆదేశాలను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో రికార్డులను స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు రికార్డ్స్ స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రత్యేకంగా -మిగతా 2 లో

## హిందూదేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు

- గాంధీభవన్ ముట్టడికి బిజెపి యత్నం
- అడ్డుకున్న పోలీసులు..స్వల్ప ఉద్రిక్తత



హైదరాబాద్, డిసెంబర్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని గాంధీభవన్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం -మిగతా 2 లో




# తెలంగాణ గురుకులంలో అర్ధరాత్రి రక్తపాతం!

**వైస్ కెప్టెన్ అయ్యాడన్న కక్షతో జూనియర్‌పై అర్ధరాత్రి హత్యా యత్నం!**

- 20 మంది ఇంటర్ విద్యార్థుల దాడి
- కర్రలు, బ్యాట్లు, వికెట్లతో చితక్కొట్టిన ఘటన
- ఫిర్యాదు వద్దంటూ ఒత్తిళ్లు?
- గురుకుల పాలనపై తెలంగాణవ్యాప్తంగా ఆగ్రహం
- గురుకులాల్లో విద్యార్థుల భద్రత ఎవరి బాధ్యత?
- రాత్రివేళల్లో పర్యవేక్షణ ఎందుకు లేదు?
- రాగింగ్ నిరోధక కమిటీలు ఏం చేస్తున్నాయి?
- "నీలగిరి ఎక్స్ ప్రెస్" ఎక్స్ క్లూజివ్





హైదరాబాద్, డిసెంబర్ 03 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :
తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల విద్యా వ్యవస్థకు తీవ్ర అపకీర్తి తెచ్చే విధంగా సంఘటన జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాలలో విద్యార్థుల మధ్య రాగింగ్ హద్దులు దాటి అమానుష దాడికి దారితీసింది. వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్నాడనే ఒక్క కారణంతో పదవ తరగతి చదువుతున్న కౌశిక్ వర్ధన్ అనే జూనియర్ విద్యార్థిపై సీనియర్ ఇంటర్ విద్యార్థులు అర్ధరాత్రి మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. ఈ దాడిలో కౌశిక్‌తో పాటు అతడిని రక్షించేందుకు వచ్చిన మరో ఐదుగురు విద్యార్థులు కూడా తీవ్రంగా గాయపడ్డారు.

- "నిద్రలో ఉండగానే దాడి షర్ట్ విప్పమని బెదిరింపులు"

బాధిత విద్యార్థి కౌశిక్ వర్ధన్ నీలగిరి ఎక్స్ ప్రెస్ ప్రతినిధికి కు తెలిపిన వివరాల ప్రకారం రాత్రి 9 గంటల వరకు స్టడీ అవర్స్ పూర్తయ్యాక విద్యార్థులు నిద్రలోకి వెళ్లారు. అర్ధరాత్రి సుమారు 11:50 గంటల సమయంలో సుమారు 20 మంది ఇంటర్ విద్యార్థులు ఒక్కసారిగా గదిలోకి చొరబడి, నిద్రలో ఉన్న తనను లేపారని వాపోయాడు. "షర్ట్ తీసుకో%ా% బయటకు రా" అంటూ ఆదేశాలు జారీ చేసి, వ్యతిరేకించగానే కాల్లు పట్టుకుని లాక్కెళ్లి బెడ్‌పై నుంచి కింద పడేసి కర్రలు, క్రికెట్ బ్యాట్లు, వికెట్లు ఉపయోగించి అడ్డూ అదుపు లేకుండా కొట్టారని -మిగతా 2 లో




## తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

- రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్రమంత్రులకు ఇన్విటషన్
- భట్టితో కలసి ఆహ్వానించిన సిఎం రేవంత్
- తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి



న్యూఢిల్లీ,డిసెంబర్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): దేశ రాజధాని దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలసి ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు. -మిగతా 2 లో

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

మొదటి తరువాయి

మోడీ ప్రభుత్వం ''కార్మిక వ్యతిరేక.. కార్పొరేట్‌కు అనుకూలం'' అని విమర్శించారు.పార్లమెంటు ప్రాంగణంలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు నిరసన తెలిపాయని, కొత్తగా అమలు చేసిన కార్మిక కోడ్‌ల గురించి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయని అన్నారు. ''కొత్త కోడ్‌లలో కొన్ని తీవ్రమైన ఆందోళన లు ఉన్నాయి. ఉద్యోగ భద్రతకు ముప్పు. లేఆఫ్ పరిమితిని 100 నుంచి 300 మందికి పెంచారు. అంటే దేశంలోని 80 శాతం కంటే ఎక్కువ పరిశ్రమ లు ఇప్పుడు ప్రభుత్వ అనుమతి లేకుండా కార్మికులను తొలగించవచ్చు. ఉద్యోగ భద్రతను తగ్గిస్తాయి. స్థిర కాల ఉపాధి (ఎఫ్‌టిఈ) విస్తరణ అనేక శాశ్వత ఉద్యోగాలకు ముగింపు పలికింది. కంపెనీలు ఇప్పుడు స్వల్పకాలిక ఒప్పందాలపై కార్మికులను నియమించుకోవచ్చు. దీర్ఘకాలిక ప్రయోజనాలను ఉండవు'' అని ఆయన అన్నారు. ఈ కోడ్ ఎనిమిది గంటల పని దినాన్ని కాగితంపై ఉంచినప్పటికీ, రాష్ట్రాలు సౌకర్యవంతమైన షెడ్యూలింగ్‌తో 12 గంటల షిఫ్ట్‌లను అనుమతించవచ్చని ఆయన పేర్కొన్నారు.''రాష్ట్రాలు నిర్ణయించిన ఓవర్ టైమ్ పరిమితులతో కలిపి, ఇది సమర్థవంతంగా చాలా ఎక్కువ పనిదినాలను అనుమతిస్తుంది. 'ఏకాభిప్రాయం' అని లేబుల్ చేయబడినప్పటికీ అలసట, భద్రతా ప్రమాదాలను పెంచుతుంది'' అని ఖర్గే అన్నారు. ''కార్మికులు సమ్మె చేయడానికి 60 రోజుల ముందు వేచి ఉండాలి. అదనంగా 14 రోజుల కూలింగ్-ఆఫ్ వ్యవధి ఉండాలి. ఇది అసురక్షిత లేదా అన్యాయమైన పరిస్థితులపై స్పష్టం చేస్తోంది. 51 శాతం సభ్యత్వం కలిగిన ఒక యూనియన్‌ను ఏకైక సంధానకర్తగా ఉంచడం చిన్న యూనియన్‌లను పక్కన పెడుతుంది. విభిన్న కార్మిక సమూహాలకు ప్రాతినిధ్యం తగ్గిస్తుంది'' అని పేర్కొన్నారు. 300 కంటే తక్కువ మంది కార్మికులు ఉన్న యూనిట్లకు స్టాండింగ్ ఆర్డర్లు వర్తించవని ఆయన తెలిపారు. ''పని గంటలు, సెలవులు, తొలగింపులపై ప్రాథమిక నియమాలు తప్పనిసరి కావు. ఇది మధ్య తరహా యూనిట్లలో ఏకపక్ష 'నియామకం, తొలగింపు' పద్ధతులను పెంచుతుంది'' అని అన్నారు. ఈ కోడ్‌లు కార్మికుల భద్రత, సంక్షేమాన్ని బలహీనపరిచాయని ఖర్గే పేర్కొన్నారు

## ఎనిమిది యుద్ధాలు ఆపా

మొదటి తరువాయి

చెబుతున్నారని ట్రంప్ అన్నారు. 'మరి ఆ ఎనిమిది యుద్ధాల మాటేమిటి? భారత్, పాకిస్తాన్ ఇలా అన్ని యుద్ధాలనూ నేనే ఆపాను. ప్రతి యుద్ధానికీ నాకు నోబెల్ ఇచ్చి ఉండాల్సింది. అత్యాసతో ఉండాలని నేనేమీ అనుకోవడం లేదు' అని చెప్పారు. యుద్ధాల కారణంగా ప్రాణాలు కోల్పోయే వారి గురించే తాను ఎక్కువగా ఆలోచిస్తానని తెలిపారు. తాను నోబెల్ శాంతి బహుమతికి అర్హుడినేనని ఈ సంవత్సరపు విజేత పరిస్కా చెప్పారని గుర్తు చేశారు.

**నిద్రలో జోగుతూ**

మూడు గంటల పాటు జరిగిన అమెరికా క్యాబినెట్ సమావేశంలో ట్రంప్ అనేక సార్లు నిద్రలోకి జారుకున్నారు. 79 సంవత్సరాల ట్రంప్ కళ్లు మూస్తూ తెరుస్తూ ఉన్న దృశ్యాలను కెమేరాలు బంధించాయి. ఒక సందర్భంలో అయితే ఆయన పూర్తిగా నిద్రలోకి వెళ్లిపోయారు. వాణిజ్య మంత్రి హొవార్డ్ లుత్నిక్ మాట్లాడుతున్న సమయంలో ట్రంప్ కొద్దిసేపు నిద్రపోయినట్లు కన్పించింది. సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఆయన 160కి పైగా పోస్టులు షేర్ చేసి అలసిపోయారు.

## హిందూదేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు

మొదటి తరువాయి

గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ..నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్థలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉదాహరించారని చెప్పారు. అంతేకాని హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశ్యం సీఎం రేవంత్ రెడ్డికి ఎట్టి పరిస్థితుల్లో లేదని పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదీకాక రేవంత్ రెడ్డి పాలనపై విమర్శించేందుకు బీజేపీ నేతలకు ఏ అంశం దొరకలేదని చెప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వారు ఆక్షేపిస్తున్నారని చెప్పారు.

## మహానరగంగా ఇక హైదరాబాద్




రికార్డ్స్ ప్రొఫార్మ రూపొందించాలని తెలిపారు. ఇక, 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితాను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ లో విలీనం అయ్యే 27 మున్సిపాలిటీలలో ఉన్న సిబ్బంది వివరాలను తక్షణమే అందించాలని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పూర్తి వివరాలు సమర్పించాల్సిందిగా లేఖ రాశారు. జీహెచ్‌ఎంసీలో మున్సిపాలిటీల ప్రక్రియ వేగవంతం చేసేందుకు అత్యవసరంగా ఈ డేటాను కోరినట్లు కమిషనర్ లేఖలో స్పష్టం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్-1955లో వచ్చిన తాజా ఆర్డినెన్స్‌ల ఆధారంగా విస్తరణకు అనుమతి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి నుంచి మొత్తం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ జీహెచ్‌ఎంసీ పరిధిలో భాగం కానుంది. ఈ మేరకు కోర్ అర్బన్ రీజియన్ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. జీహెచ్‌ఎంసీని ఇప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద అర్బన్ అడ్మినిస్ట్రేటివ్ యూనిట్‌గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

# మరో 40 వేల ఉద్యోగాలిస్తాం

మొదటి తరువాయి

ముందుగా రూ.262.78 కోట్లతో హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు మంత్రులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. హుస్నాబాద్ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉందని, సర్దార్ సర్వాయి పాపన్న నేతృత్వంలో బహుజన రాజ్యానికి పునాదులు వేసిన గడ్డ అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కరీంనగర్ ప్రజలు కీలక పాత్ర పోషించారని, రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని కరీంనగర్ వేదికగా సోనియమ్మ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని తెలిపారు. 60 ఏండ్ల కల నెరవేర్చిన సోనియమ్మను కలిసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం అందించానని, ప్రధాని మోడీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని కలిసి గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించి వచ్చామని, అందుకే సభకు రావడం ఆలస్యమైందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరలేదని, బీఆర్‌ఎస్ పాలనలో లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలేశ్వరం అయిందని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రైతులకు రూ. 2 లక్షల రైతు రుణమాఫీ చేసి రుణ విముక్తులను చేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి



వరకు లక్షా 4 వేల కోట్ల రూపాయలు రైతుల కోసం ఖర్చు చేసినట్టు తెలిపారు. రూ. 8 వేల కోట్లు ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం ఖర్చు చేశామని, ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని అన్నారు.పదేండ్లు అధికారంలో ఉన్నవాళ్లు హుస్నాబాద్‌కు సాగునీరు అందించే గండిపెల్లి, గౌరెల్లి ప్రాజక్టులను పూర్తి చేయలేదని ఆరోపించారు. హుస్నాబాద్ కేసీఆర్‌కు ప్రచారానికి సెంటిమెంట్ అని, నిధులు ఇవ్వడానికి కాదని అన్నారు. ప్రచారం మొదలు పెట్టేందుకు సెంటిమెంట్‌గా హుస్నాబాద్‌ను ఉపయోగించుకున్నారని తెలిపారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లను అభివృద్ధి చేసుకున్నారు కానీ హుస్నాబాద్‌ను అభివృద్ధి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పాలకుల్లా తాము హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయబోమని, ఎన్ని నిధులైనా ఖర్చు చేసి అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. గత పదేండ్లలో బీఆర్‌ఎస్ పేదలకు ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వలేదని, పదేండ్లు ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉంటుందని, ఈ పదేండ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇండ్లు కట్టిస్తామని తెలిపారు.సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయని, ఇవి మన గ్రామాల్లో వెలుగులు నింపే ఎన్నికలని అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో మంచోళ్లని ఎన్నుకోవాలని, ఏకగ్రీవం అయినా చేసుకోండి లేదా మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పనిచేసి, గ్రామాలను అభివృద్ధి చేసే వాళ్లను సర్పంచులుగా ఎన్నుకోండి అని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అడిగిన రింగ్ రోడ్డు, ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, తాగు నీరు ఇతర పనులను చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సంజయ్ కుమార్, సత్యనారాయణ, సత్యం, నాయకులు వీహెచ్, సిరిసిల్ల రాజయ్య, వెంకట్రామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భూధార్ కార్డులు

మొదటి తరువాయి

రెండేండ్లలో పునర్నిర్మించామని అన్నారు. భూహక్కుల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు సమూల సంస్కరణలను అమలు చేశామని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల సమాచారంతో కూడిన సింగిల్ పేజీ డిజిటలైజేషన్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. విదేశీ సంస్థ రూపొందించిన ధరణి పోర్టల్ యాప్‌ను బంగాళాఖాతంలో వేశామని స్పష్టం చేశారు. దాని స్థానంలో జనవరి నాటికి భూభారతి కొత్త యాప్‌ను తెస్తామనీ, ఇందుకు సంబంధించి ఎన్‌ఐసీ కసరత్తు చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో 413 గ్రామాల్లోని భూములకు నక్షాలు లేవని అన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఐదు గ్రామాలను ఎంపిక చేశామనీ, నక్షాలతోపాటు భూమికి సరిహద్దులు, సర్వేనెంబర్లను కేటాయిస్తామని వివరించారు. ఆయా గ్రామాల్లోని రైతులకు భూధార్ కార్డులను సిద్ధం చేశామనీ, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంపిణీ చేస్తారని చెప్పారు. పట్టణాల్లో ఉన్న వాటిని తీసేస్తే మిగిలిన 373 గ్రామాల్లో రెండో విడతలో భూధార్ కార్డుల పంపిణీ చేపడతామని అన్నారు. మూడో విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల చొప్పున వివాదం లేకుండా అభద్రత లేకుండా భూభారతి చట్టాన్ని అమలు చేస్తామన్నారు. ఆ తర్వాత అన్ని గ్రామాల్లోని రైతులకు భూధార్ కార్డులిస్తామని చెప్పారు. ఆలస్యమైనా పారదర్శకంగా ఈ ప్రక్రియను చేపడతామని అన్నారు.

**డిసెంబర్ నాటికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు**

రాష్ట్రంలో 10,543 రెవెన్యూ గ్రామాలున్నాయని మంత్రి పొంగులేటి చెప్పారు. ఆరు వేల మంది వీఆర్వోలను నియమించామని అన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం 10,400 మంది దరఖాస్తు చేశారని వివరించారు. మొదటి విడతలో 3,490 మంది అర్హత సాధించారని అన్నారు. ప్రతి మండలానికి నలుగురు లేదా ఆరు మంది సర్వేయర్లున్నారని చెప్పారు. మరో 2,500 మంది సర్వేయర్లను డిసెంబర్ చివరినాటికి నియమిస్తామని వివరించారు. భూసర్వేకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తామన్నారు. అందుకోసం 400 రోవర్లను కొనుగోలు చేశామని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం వాటిని కొనుగోలు చేయలేదని అన్నారు. రాష్ట్రంలోని 2.29 కోట్ల సర్వే నెంబర్లకు భూధార్ నెంబర్లను కేటాయించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.

# తెలంగాణ గురుకులంలో అర్ధరాత్రి రక్తపాతం!


మొదటి తరువాయి

బాధితుడు కన్నీళ్లతో వివరించాడు.

**- రక్షించేందుకు వచ్చినవారిపైనా దాడి**

ఈ దాడిని అడ్డుకునేందుకు ముందుకు వచ్చిన ఇతర విద్యార్థులపైనా సీనియర్లు దాడికి పాల్పడ్డారు. మొత్తం ఐదుగురు విద్యార్థులు గాయపడ్డారు. సెక్యూరిటీ వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ సమయంలో లభించిన చిన్న అవకాశంలో కౌశిక్ అక్కడి నుంచి తప్పించుకుని బయటకు పరుగులు తీశాడని, కానీ తిరిగి వెతుక్కుంటూ వచ్చిన వారిని చూసి భయంతో మళ్లీ స్కూల్ ఆవరణలో దాక్కున్నట్లు తెలిపాడు. "కంప్లైంట్ అవసరం లేదు" భయభ్రాంతులు కలిగించిన ఒత్తిళ్లు? ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని బాధిత వర్గాలు భావించగా, "పిల్లలు చిన్నవాళ్లో అర్థం లేదు కేసు పెడితే ఇన్స్టిట్యూట్ పేరు పోతుంది" అంటూ ఫిర్యాదు చేయవద్దని కొందరు ఒత్తిడి తెచ్చినట్లు బాధిత వర్గాల ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇది కేవలం ఒక విద్యార్థిపై దాడి కేసు మాత్రమే కాకుండా, గురుకుల వ్యవస్థలో కొనసాగుతున్న అంతర్గత అణచివేతకు నిదర్శనమని విద్యార్థి సంఘాలు





వ్యాఖ్యానిస్తున్నాయి.

**- రాష్ట్రవ్యాప్తంగా స్పందన... చర్యలు తప్పనిసరి**

ఈ ఘటన తెలంగాణ వ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రభుత్వ పెద్దలు వెంటనే స్పందించి, సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థులకు న్యాయం కల్పించాలని తల్లిదండ్రులు, పౌర సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

మొదటి తరువాయి

తులంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-బెంగళూరు-చెన్నై బుల్లెట్ రైలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని అభ్యర్థించారు. పలువురు కేంద్ర మంత్రులతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను కలిసిన సీఎం సమ్మిట్‌కు ఆహ్వానించారు. కాగా, మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి గ్లోబల్ సమిట్‌కు రావాలని కోరారు. తరవాత సిఎం రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో ..తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిందూ సమాజంలాంటిదే కాంగ్రెస్ అని డీసీసీ అధ్యక్షులకు చెప్పానని సిఎం వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఉత్తర భారతంలోనూ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన విషయాల్లో ముందు వెనక కట్ చేసి కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు తెలంగాణలో తన నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు.

# ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో నోట్‌బుక్స్ పంపిణీ



**షాద్ నగర్, డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
షాద్నగర్ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షులు గందే సురేష్ నేతృత్వంలో గాంధీనగర్ కాలనీ ఎడెడ్ జియాన్ స్కూల్, సులేమాన్ కాలనీ, ఆర్టీసీ కాలనీ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా గందే సురేష్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 25 వేల నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా షాద్నగర్‌లో ఈరోజు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. జియాన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఇటువంటి సామాజిక కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘాలు ఎల్లప్పుడూ ముందుంటాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, నరేందర్ రెడ్డి, మహేందర్, చంద్రయ్య, శ్రీనివాస కాలనీ ప్రధానోపాధ్యాయురాలు వీ.రజిత, ఉపాధ్యాయులు లక్ష్మీదేవమ్మ, మాధవాచారి, వనజ, ధనలక్ష్మి, యోగా గురువు గవ్వయ్య, అసిస్టెంట్ గురువు కరుణాకర్ పాల్గొన్నారు. అలాగే బుక్స్ కమిటీ చైర్మన్ ఎల్కుర్తి నారాయణ, కో-చైర్మన్ అనుమారి మురళి, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మల్లిపెద్ది శ్రీనివాస్, జిల్లా యువజన సంఘం కోశాధికారి నీల రవీందర్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీకాంత్ చారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**గజ్వేల్, డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ పోరాటంలో మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంత్ చారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు నమాజ్ మీరా, మండల అధ్యక్షుడు బెండ మధు, మాజీ కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్, పంబాల శివ, మల్లేష్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు స్వామి చారి, కళ్యాణ్కర్ శ్రీనివాస్, హనుమంత రెడ్డి, కూరాకుల సాయి, నరేష్ యాదవ్, ఎల్లా వెంకటేశం, ఖాసీం భాయ్, వాజిద్ భాయ్, రమేష్ యాదవ్, శ్రీరామ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# హైకోర్టు న్యాయవాదికి ఘన సన్మానం.



**ఎలిగేడు, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తొలి రాష్ట్రపతి,గొప్ప న్యాయవాది బాబు రాజేంద్రప్రసాద్ జయంతిని పురస్కరించుకుని న్యాయవాదుల దినోత్సవ సందర్భంగా హైకోర్టు అడ్వకేట్ బుర్ర వీరస్వామి గౌడ్ ను ఎలిగేడు మండల కేంద్రంలో ఆయన నివాసంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి అనంతరం సీట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కవ్వంపల్లి చంద్రయ్య, తాటి పెల్లి సతీష్ బాబు,ముంజం నరేష్, ముంజంపల్లి లింగమూర్తి, గ్యాజంగి ఉమాపతి, బ్రహ్మోజీ మధు, బంగ్లా శ్రీనివాస్, చెక్కర్ల చందు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



**ఎల్బీనగర్, డిసెంబర్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఎల్బీనగర్ రింగ్ రోడ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వనస్థలిపురం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవి కుమార్, బి.ఎన్.రెడ్డి నగర్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతల రవి కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన కీలక ఘట్టాల్లో శ్రీకాంతాచారి ఆత్మార్పణం ఒకటని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయడానికి తన శరీరాన్ని సమిధలా చేసి త్యాగం చేసిన శ్రీకాంతాచారి పేరు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. అలాగే రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర కీలకమైందని, ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆయన కోరారు.

# షాట్ సర్క్యూట్ తో కారు దగ్ధం

**-కడ్తాల్ మండలం మక్తమాదారం శివారులో ఘటన**
**- తప్పిన ప్రమాదం**





**కడ్తాల్, డిసెంబర్ 3 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మక్తమాదారం శివారులో బుధవారం ఉదయం కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. తలకొండపల్లి మండలం వెంకటాపూర్ తండకు చెందిన నలుగురు యువకులు ఆల్టో కారులో హైదరాబాద్ వెళుతున్న క్రమంలో కడ్తాల్ – షాద్ నగర్ రహదారి మక్తమాదారం గేటు శివారులో నడుస్తున్న కారులో పొగలు రావడంతో గమనించిన డ్రైవర్ కారుని ఆపాడు. కారులో ఉన్న నలుగురు యువకులు కిందకు దిగారు. కారులో మంటలు పెరిగి కారు మొత్తం దగ్ధమైంది. ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో స్థానికులు పోలీసులకు, అగ్నిమపాక సిబ్బందికి సమాచారం అందించారు.

# కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల్లో 20 కాన్పులు




**కల్వకుర్తి, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గడిచిన 24 గంటల్లో 20 కాన్పులు జరిగాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం తెలిపారు. వీటిలో 11 నార్మల్ డెలివరీలు, 9 సిజేరియన్ కాన్పులు జరిగినట్టు ఆయన వివరించారు. డాక్టర్ శివరాం మాట్లాడుతూ, డెలివరీ అయిన తల్లి, శిశువులు క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో కాన్పులు విజయవంతంగా నిర్వహించిన ఆసుపత్రి వైద్య సిబ్బందిని అభినందించారు.

# శ్రీకాంతాచారి ఆశయాలను కొనసాగిద్దాం

**- రవీందర్ యాదవ్**



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి యువ నేత, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ పాల్గొని, శ్రీకాంతాచారి త్యాగాన్ని స్మరించారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పిన కీలక ఘట్టాల్లో శ్రీకాంతాచారి ఆత్మార్పణం ఒకటని కొనియాడారు. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయడానికి తన శరీరాన్ని సమిధలా చేసి త్యాగం చేసిన ఆయన పేరు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. అమరవీరుల ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని, వారి త్యాగాలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంకు ఊపిరి పోసి తన ఊపిరిని అర్పించిన గొప్ప వ్యక్తి శ్రీకాంతాచారి అని గుర్తుచేశారు. నాడు సీఎం కేసీఆర్ అమరవీరుల త్యాగాన్ని గుర్తించి సెక్రటేరియేట్ ఎదురుగా అమరుల స్మృతి కేంద్రాన్ని నిర్మించారని తెలిపారు. తెలంగాణ కోసం నిరంతరం కష్టపడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్ యాదవ్‌తో పాటు బీఆర్ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు గంగారాం సంగారెడ్డి, ముద్దంగుల మల్లేష్, యువజన నాయకులు గణేష్ రెడ్డి, సామాజికవేత్తలు నరాల మహేష్ రెడ్డి, వేంకటేశ్వర్ రావు మరియు స్థానిక నేతలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన పలువురు బిజెపి నాయకులు



**కడ్తాల్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కడ్తాల్ మండలంలోని ముద్వేన్ గ్రామానికి చెందిన మరమోనీ రమేష్, గానుగుమర్ల తండ గ్రామపంచాయతీకి చెందిన నేనవత్ కిషన్ బిజెపి పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులను కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్లి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందేది కెసిఆర్ ద్వారానేనని, అందుకే వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సేవ్య నాయక్, నాయకులు రాఘవరెడ్డి, గోపాల్, పర్వతాలు రాజు, శంకర్, పాండు, శ్రీకాంత్, అంజి, శ్రీను, రవీందర్, పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదుల దినోత్సవం వేడుక



**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ న్యాయవాది, బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిని పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసాల రమేష్, నరహరి లక్ష్మారెడ్డి, గుజ్జ శ్రీనివాస్, పాదం శివరాజ్, కటకం లోకేష్, సాయికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ

## మొదటి రోజు 55 నామినేషన్ లు .




ఎలిగేడు గ్రామ సర్పంచ్ గా నామినేషన్ వేస్తున్న కప్పల ప్రవీణ్

**ఎలిగేడు, డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మండలంలోని 12 గ్రామాల పరిధిలో ఎన్నికల భాగంగా బుధవారం మొదటి రోజు నాలుగు క్లస్టర్ల పరిధిలో సర్పంచి, వార్డు స్థానాలకు 55 నామినేషన్ వేసినట్లు ఎం పీ డీ వో భాస్కర్ రావు తెలిపారు. ఎలిగేడు క్లస్టర్ పరిధిలో 2 సర్పంచి, 7 వార్డు స్థానాలకు, ధూళికట్ట క్లస్టర్లో 2 సర్పంచి, 21 వార్డుల స్థానాలకు, నర్సాపూర్ లో 3 సర్పంచులు, 8 వార్డులకు, సుల్తాన్ పూర్ క్లస్టర్ పరిధిలో 2 సర్పంచు, 10 వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

# కొండెక్కుతున్న కోడి ధర పంచాయతీ పోరుతో పెరిగిన డిమాండ్

- నాలుగు రోజుల్లో రూ.240 వరకు పెరిగిన చికెన్ ధర
- ప్రచార కార్యక్రమాలు ఊపందుకోనుండటంతో పెరిగిన డిమాండ్
- ఓటర్లకు చికెన్, శీతల పానీయాలు ఇచ్చేలా సర్పంచ్ అభ్యర్థుల ప్రణాళికలు



**హైదరాబాద్, డిసెంబర్ 03 ( నీలగిరి ఎక్స్ ప్రెస్** : తెలంగాణలోని పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి జోరందుకుంది. బుధవారం మొదటి విడత నామపత్రాల ఉపసంహరణ గడువు 3 గంటలతో ముగుస్తోంది. బరిలో ఎవరుంటారు. ఎవరు వైదొలగుతారో సాయంత్రం వరకు తేలనుంది. ఇక ఫైనల్గా బరిలో నిలిచే అభ్యర్థుల ప్రచారం ఊపందుకోనుంది. రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో 4236 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఓటర్లతో పాటు ప్రచారంలో పాల్గొనే వారికి మద్యం, మాంసాహారం అభ్యర్థులు రోజూ పెట్టాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో చికెన్ వ్యాపారులు ఉన్నట్టుండి మెల్లగా ధర పెంచేశారు. కిలో చికెన్ రూ. 240 ఎన్నికల ప్రక్రియకు ముందు గ్రామాల్లో కిలో చికెన్ రూ.200 నుంచి రూ.220 వరకు ఉండేది. గత నాలుగైదు రోజులుగా రూ.240 వరకు పెరిగింది. అక్కడే చికెన్ వండిస్తే రూ.330 వరకు తీసుకుంటున్నారు. రోజూ ఎంత మంది ఓటర్లకు, ఎంత పంపిణీ చేయాలో ఎన్నికలో నిల్చునే అభ్యర్థులు లెక్కలేసుకుంటున్నారు. ఈ మేరకు మాంసం వ్యాపారులతో ముందస్తుగానే మాట్లాడుకుంటున్నారు. గ్రామాల్లో ఒక్కో కుటుంబానికి అరకిలో చికెన్, కూల్ డ్రింక్స్ అందించేందుకు అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో ఎన్నికలు జరగనున్న పంచాయతీల్లో వేల సంఖ్యలో చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఓటర్ల సంఖ్యను చూసి వచ్చే 8 రోజుల్లో రోజుకు ఒక్కో దుకాణంలో 100 నుంచి 400 కిలోల చికెన్ విక్రయించనున్నారు. రాష్ట్రంలో ఇలా అభ్యర్థులు రోజూ మాంసం ఖర్చులే రూ.3.50 కోట్లు భరించాల్సి ఉంటుంది. 8 రోజుల్లో రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు కేవలం చికెన్ పైనే వ్యయం చేయనున్నారు. 'చికెన్కు డిమాండ్ పెరుగుతోంది. తొలి విడత పోరు జరుగుతున్నందున మా మండలంలో రోజు వారి ఆర్డర్లు పెరిగాయి. ముఖ్యంగా అభ్యర్థుల అనుచరులు బల్క్ ఆర్డర్లు చెబుతున్నారు. డిమాండ్ ఒక్కసారిగా పెరగడంతో ధర పెరిగింది. రాబోయే రోజుల్లో ధర మరింత పెరగడం ఖాయం' అని చికెన్ షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. ఎన్నికల్లో ప్రచారానికి అభ్యర్థులు ఇబ్బడిముబ్బడిగా ఖర్చు చేయడానికి వీలులేదు. ఎన్నికల సంఘం నిర్ణయించిన మేరకు మాత్రమే వినియోగిస్తే ఎలాంటి సమస్య ఉండదు. ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే అధికారులు చర్యలు తీసుకుంటారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఖర్చు చేస్తున్న విషయాన్ని వ్యయ పరిశీలకులు గమనిస్తూనే ఉంటారు. ప్రచారంలో జెండాలు కనిపించినా వాటిని కూడా లెక్కలు వేస్తారు. అందువల్లే పోటీ చేస్తున్న అభ్యర్థులు ఖర్చుల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

# భవిత కేంద్రాలతో దివ్యాంగుల మానసిక అభివృద్ధి




**తిమ్మాపూర్, డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన కొత్త భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రత్యేక విద్యా విధానం ద్వారా దివ్యాంగ పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందుతున్నారని, చిన్న వయసులోనే భవిత కేంద్రాల్లో చేర్పిస్తే వారు తల్లిదండ్రుల సహాయం లేకుండానే స్వయంగా పనులు చేసుకునే స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు.జిల్లాలో "దివ్య దృష్టి" కార్యక్రమం ద్వారా అంధుల, బధిరుల పాఠశాలలు, భవిత కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని, అక్కడ చదువుతున్న పిల్లల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. అధికారులకు, పాఠశాలలు, ఆసుపత్రుల సిబ్బందికి సైగల భాష నేర్పడం ద్వారా బధిరుల భావాలను అర్థం చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రత్యేక విద్యా ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు.అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ, దివ్యాంగుల కోసం జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, పాఠశాలలు, భవిత కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలను కల్పించామని తెలిపారు. భవిష్యత్తులో దివ్యాంగ విద్యార్థుల చదువుకు, వారి అభివృద్ధికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్లోత్ర, విద్యా శాఖ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్, ఎంఈఓ శ్రీనివాస్, డిఈ కృష్ణ కుమార్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**బుధవారం బోధనలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం చేయాలి**

మహాత్మా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బోధన కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. విద్యార్థులతో పాఠాలు చదివించి, కొందరు విద్యార్థులు సరిగా చదవకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 10వ తరగతి పరీక్షలు దగ్గరపడుతున్నందున ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.ప్రతి రోజు పాఠాలు బిగ్గరగా చదవాలని, బుధవారం బోధనలో ప్రతి విద్యార్థి పాల్గొనాలని, అర్థం కాని విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## ఇనాం గూడ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా అంతటి ధనరాజ్ గౌడ్



**అబ్దుల్లాపూర్ మెట్. డిసెంబర్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండల లోని రెండవ సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా ఇనాం గూడ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా అంతటి ధనరాజ్ గౌడ్ తమ నామినేషన్ ను ఎన్నికల అధికారులకు తన అనుచరులతో కలిసి బుధవారం అందజేసారు. ఈ సందర్భంగా అంతటి ధనరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. అంతటి ధనరాజ్ గౌడ్ ఇనాం గూడ గ్రామం సర్పంచ్ అభ్యర్థిగా తనకు అవకాశం ఇచ్చినటువంటి గ్రామ పెద్దలకు యువకులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తాను రాబోయే ఎన్నికల్లో సర్పంచ్ గెలిచి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి నెలకొని ఉన్న సమస్యలను తాను గెలిచిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే సహకారంతో వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలియజేశారు.తమ అమూల్యమైన ఓటుతో కాంగ్రెస్ అభ్యర్థి అయినటు వంటి తనను బలపరిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గుడుంబా తయారీ వ్యక్తులపై కేసు నమోదు



**దేవరకొండ డిసెంబర్ 03. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, డిపిఈఓ నల్గొండ సూచనల మేరకు ఎస్ హెచ్ ఓ దేవరకొండ బృందం, డిటిఎఫ్ నల్గొండ మరియు ఎన్ఫోర్స్మెంట్, బృందం చందంపేట మండల పరిధిలోని గోల్య సీత్య తాండ,మునవత్ తాండా,చందంపేటముడుదండ్ల మరియు పోలేపల్లి గ్రామాలలో సోదాలు నిర్వహించారు.ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు వారినుండి 9 లీటర్ల సారాయి ,400 లీటర్ల సారాయి తయారీ జలాన్ని నాశనం చేశామని ఎస్ హెచ్ ఓ శ్రీనివాస్ తెలిపారు.

## "లంచం అడగడం, తీసుకోవడం నేరం" గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ :ఇలా త్రిపాఠి




**నల్లగొండ, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఈ నెల 3 నుండి 9 వరకు నిర్వహించనున్న తెలంగాణ ఏసీబీ వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఆమె తన చాంబర్లో లంచం నేరమని తెలిపేలా రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. పరిపాలనలో పారదర్శకత అవసరమని, ఎవరైనా ప్రభుత్వ అధికారి, ఉద్యోగి లంచం అడిగితే వెంటనే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తెలియజేయాలని ఆమె తెలిపారు. కాల్ చేసిన వారి పేరును గోప్యంగా ఉంచడం జరుగుతుందని, అవినీతిని అరికట్టడంలో ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అవినీతిని అరికట్టడంలో భాగంగా సోషల్ మీడియా ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని, వాట్సాప్ నంబర్ 9440 446106, ఫేస్బుక్ ACB Telangana, X (పాత ట్విట్టర్) ఏ Telangana ACB ద్వారా అలాగే పోస్టర్ లో ముద్రించిన QR కోడ్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.

## క్రీడల ద్వారా శారీరక మానసిక సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చు కలెక్టర్ ఇలా త్రిపాఠి




**నల్లగొండ ,డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
బుధవారం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లాలో దివ్యాంగులకు నిర్వహించిన క్రీడా పోటీలలో దివ్యాంగులు క్రీడా స్ఫూర్తితో ఆడారని కలెక్టర్ అన్నారు. క్రీడల ద్వారా మానసిక, శారీరక సామర్థ్యాలు పెంపొందించుకోవడం తో పాటు, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. సమాజంలోని అందరితోపాటు, దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకుగాను విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్య అభివృద్ధి వంటి రంగాలలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడానికి రెవిన్యూ డివిజన్లు, మండలాలలో సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ ప్రత్యేక ప్రజావాణిలో దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.దివ్యాంగుల సంక్షేమం కోసం బ్యాటరీ మోటార్ వెహికల్స్, పింఛన్లను ప్రభుత్వం ఇస్తున్నదని, దివ్యాంగుల ఇతర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. దివ్యాంగులు బాగా చదువుకోవాలని, అన్ని రంగాలలో అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.

## ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



**జవహర్ నగర్, డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జవహర్ నగర్ అంబేద్కర్ నగర్ ఎన్టీఆర్ కాలనీలో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సాయి అయ్యప్ప సేవ ట్రస్ట్ చైర్మన్ రేగళ్ల సతీష్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మాదిరెడ్డి హరినాధ రెడ్డి, శేఖర చారి హాజరై, దివ్యాంగులకు చంక కర్రలు, దుప్పట్లు అందించి వారిని సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగవైకల్యం అనేది శరీరానికి మాత్రమే కానీ మనసుకు కాదని, దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. నేడు అన్ని రంగాల్లో దివ్యాంగులు సత్తా చాటుతున్నారని అభినందించారు. వారికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోనార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వంగ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నేతి శ్రీధర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బత్తిని బిక్షపతి గౌడ్, పిఓడబ్ల్యూ విముక్తి కన్వీనర్ పెర్క సునీత, తెలంగాణ ఐక్యవేదిక వ్యవస్థాపకులు మబ్బు బాలు, జవహర్ నగర్ దివ్యాంగుల నాయకులు పెద్ద మేతరి రాము, దప్పు శీను, రమేష్, సమ్మయ్య, గణేష్, సోను, అలాగే శ్రీ సాయి అయ్యప్ప సేవ ట్రస్ట్ స్వాములు వెంకట్ రెడ్డి, మహేష్ చారి, మాధవరెడ్డి, స్థానిక దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం




**బొడుప్పల్, డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కీసర రామలింగేశ్వర కాలనీలో బుధవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని దివ్యాంగులు కలిసి ఘనంగా నిర్వహించారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ స్వీట్లు పంచుకొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్ష్మి పాల్గొని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మహిళా పొదుపు సంఘాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నట్లే, వికలాంగుల పొదుపు సంఘాలను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనికి అందరి సహకారం అవసరమని ఆమె కోరారు. తదుపరి వంగ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు అతి చేరువలో ఉండే దివ్యాంగుల సమాజానికి పొదుపు సంఘాలు ఆర్థిక భరోసా కల్పిస్తాయని అన్నారు. రామలింగేశ్వర కాలనీలో 90 శాతం కుటుంబాలు దివ్యాంగులవే కావడంతో వారందరినీ పొదుపు సంఘంలో చేర్చేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, లక్ష్మి, వంగ శ్రీనివాస్ రెడ్డి, దత్తు, టైగర్ నరసింహ, అల్లాజీ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


# బీఆర్ఎస్‌కు నాలుగు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

### గత పాలనలో అభివృద్ధి ఈ ఫలితాలకు కారణం -సింగిరెడ్డి










**వనపర్తి,డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు నాలుగు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవంగా దక్కాయి. ప్రజలు గత అభివృద్ధిని ఆదరించడమే ఈ ఫలితానికి కారణమని మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల మధ్య నిరంతరం ఉండి సమస్యలకు స్పందించిన మా శ్రేణుల కృషికి ఇది గుర్తింపని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయధ్వజం ఎగరేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఏకగ్రీవంగా ఎన్నికైనవారు: 1. కొడవత్ శాంతి – కర్నెతండా (ఘన్పూర్)2. కేతావత్ చంద్రమ కోతులకుంతండా(ఘన్పూర్) 3.ముదావత్కవిత – అముదాలకుంటతండా(గోపాలపేట)4. బంగారయ్య – లక్ష్మీదేవిపల్లి(గోపాలపేట)ఏకగ్రీవం చేసిన ప్రజల విశ్వాసానికి కట్టుబడి పనిచేస్తామని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఘనంగా సైబర్ జాగరుకత దినోత్సవం




**మహబూబాబాద్, డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ మండలంలోని శనగపురం గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈరోజు సైబర్ జాగరుకత దినోత్సవం మరియు ఫ్రాడ్ ఫుల్ స్టాప్ కార్యక్రమం భాగంగా సైబర్ క్రైమ్ నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న ఆన్లైన్ మోసాల పద్ధతులు, వాటి నుండి రక్షణ పొందడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, కాల్స్, మెసేజ్‌లు నమ్మకూడదని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ సర్వయ్య, రూరల్ ఎస్సై దీపిక, బ్లూకోల్ట్ సిబ్బంది సంపత్, బాపూజీ, స్కూల్ హెడ్‌మాస్టర్ శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘంటసాల – కాలాన్ని జయించిన గళం

తెలుగు సంగీత చరిత్రలో కొన్ని స్వరాలు కాలానికి అతీతాలు. వాటిలో అగ్రస్థానంలో నిలిచింది ఘంటసాల గళం. ఆయన స్వరం వినగానే మనసు కాసేపు నిశ్శబ్దమై, ఏ రకం భావనలో ఉన్నా ఒక ప్రత్యేకమైన అనుభూతి లోకి నడిపించగల సంగీత ఔషధం అది. ఘంటసాల పాటల్లో భావం ఒకటుంటుంది, భక్తి ఒకటుంటుంది, భాషకు ఇచ్చిన గౌరవం ఒకటుంటుంది. ప్రతి అక్షరం ఒక శిల్పంలా, ప్రతి స్వరం ఒక ఆలయంలా వినిపించేది. “భగవద్గీత”ను ఆయన గళమే ప్రజల్లోకి తీసుకువెళ్లింది. “మల్లెలు తీరాన”, “శివశివ అనందస్వరూప”, “ఎంత వృధా నైవేద్యం” నుంచి అనేక శాశ్వత గీతాల వరకు – ఆయన స్వరం ఎప్పటికీ మసకబడని వెలుగు. తరాలు మారినా, సంగీత పంథాలు మారినా, వినికిడి పరికరాలు మారినా.. తెలుగు మనిషి హృదయంలో ఘంటసాల మాత్రమే ఒక శాశ్వత ధ్వని. ఆయన పాట వింటే ఆనందం అలా ఒడిసి పట్టుకుంటుంది... విషాదం కూడా ఓదార్పును పొందుతుంది.. భక్తి పట్ల మనసు మరింత నిబద్ధతతో నిలుస్తుంది. ఈరోజు ఆయన జన్మదినం. ఆయన లేరనేది నిజం..
కాని ఆయన గళం ఇంకా అన్ని తెలుగు ఇండ్లలో ప్రతిధ్వనిస్తున్నదనేది మరింత గొప్ప నిజం. కాలాన్ని జయించిన స్వరం ఘంటసాలది. సంగీతాన్ని శాశ్వతంగా మార్చిన మహానుభావుడు ఘంటసాలే.

**గంగవరం రామకృష్ణారెడ్డి**
**సీనియర్ జర్నలిస్టు**



# రైల్వే డిపో తరలిస్తే ఊరుకునేది లేదు



**మహబూబాబాద్, డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లాకు రైల్వే శాఖ ద్వారా కేటాయించబడిన రైల్వే మెగా మెయింటినెన్స్ డిపోను ఇక్కడ నిర్మించాలని ఈ ప్రాజెక్టును తరలించే ప్రయత్నాలను అడ్డుకోవడానికి జిల్లాలోని అన్ని రాజకీయ పక్షాలు ఉద్యమకారులు ప్రజాసంఘాలు యువజన విద్యార్థి మహిళా సంఘాలు అందరూ ఒక్కటై పోరాడాలని డిమాండ్తో ఈరోజు వివిధ రాజకీయ ప్రజాసంఘాల బాధ్యుల సమావేశంఈరోజు స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో ఈ రైల్వే మెగా మెయింటినెన్స్ డిపో తరలింపు ప్రయత్నాలను అడ్డుకొని మానుకోటలోనే నిర్మించుటకు ఉద్యమ కార్యాచరణకు అఖిలపక్షం ఏర్పడాలని దీనికి సంబందించిన సమావేశం తేదీ 5. 12.2025న స్థానిక గంగపుత్ర భవనంలో ఉదయ 11 గంటలకు నిర్వహించబడుతున్నందున రాజకీయ పక్షాల, ప్రజాసంఘాల, యువజన, నిరుద్యోగ,విద్యార్థి,మహిళావివిధ కుల సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరనైనది. ఈ సమావేశంలో వివిధ పార్టీలు ప్రజాసంఘాల బాధ్యులు డాక్టర్ డోలి సత్యనారాయణ,మైస శ్రీనివాసులు,మాదవ పెద్ది శశివర్ధన్ రెడ్డి, గుగ్గిళ్ళ పీరయ్య, మామిడాల సత్యనారాయణ, పిల్లి సుధాకర్,ఎండి ఫరీద్, సోమ విష్ణువర్ధన్,షేక్ జానీలు పాల్గొన్నారు.

# దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలు

### - అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో




**మహబూబాబాద్,డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి సభిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగుల హక్కులు, అవకాశాలు, సామాజిక బాధ్యతలపై ముఖ్య సందేశాన్ని అందించారు. దివ్యాంగుల జీవన విధానాన్ని మెరుగుపరిచే దిశగా మరిన్ని సంక్షేమ చర్యలను తీసుకెళ్లేందుకు అధికారులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని, ప్రపంచ వేదికపై దేశ కీర్తిని చాటిన ఘనత వారిదేనని అన్నారు. వారితో ఆత్మీయంగా మెలగాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఉందని సూచించారు. తదనంతరం జిల్లాకేంద్రంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన దివ్యాంగ క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు, సూపర్వైజర్లు, దివ్యాంగుల అసోసియేషన్లు, సంఘాల నాయకులు, సభ్యులు, పెద్ద ఎత్తున దివ్యాంగులు, అలాగే సిబ్బంది బి. రాజు, ఎం. హరీష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా.. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం






**మహబూబాబాద్, డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ కార్యాలయం సమీపంలోని గిరిజన భవన్‌లో ఈరోజు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, దివ్యాంగులు మరియు వారి సంఘాల ప్రతినిధులు భారీగా పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం నిర్వహించిన అవగాహన సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు చెందిన సీనియర్ న్యాయవాది, మధ్యవర్తి చెన్న మల్లారెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగుల కోసం భారత రాజ్యాంగం మరియు చట్టాలు కల్పించిన రక్షణలు, సహాయ సేవలు, హక్కులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై సమగ్రంగా వివరించారు. సమాజంలో దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఉచిత న్యాయ సహాయానికి అర్హులైనవారు నిరభ్యంతరంగా సంప్రదించవచ్చని సూచించారు. జిల్లా సంక్షేమాధికారి సబిత, మహిళా మరియు శిశు సంక్షేమాధికారి శిరీష మాట్లాడుతూ, దివ్యాంగులకు గల చట్టాలు, ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాల గురించి వివరించారు. వారి సంక్షేమానికి జిల్లా పరిపాలన తరపున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజ్ కృష్ణ, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



**వరంగల్,డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వరంగల్ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయ ప్రధానాచార్యులు బి. పూర్ణిమ తెలిపారు ?? 2026-27 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష డిసెంబర్ 13, 2025న ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించబడనుంది. ఈ పరీక్షకు మొత్తం 5648 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షను నిర్వహించేందుకు జిల్లాలోని 28 సెంటర్లలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందుకోసం దరఖాస్తు సమయంలో పొందిన రిజిస్ట్రేషన్ నెంబర్ మరియు పుట్టిన తేదీను నమోదు చేయాలి. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు విద్యాలయ హెల్ప్‌లైన్ నెంబర్ 9110782213కు సంప్రదించి తమ వివరాలు తెలియజేసి హాల్ టికెట్ పొందవచ్చని ప్రధానాచార్యులు తెలిపారు.

# పీచుపల్లిలో సర్పంచ్ పదవి ఏకగ్రీవం



**గన్నేరువరం, డిసెంబర్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పీచుపల్లి గ్రామంలో సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా ఖరారైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండో విడత నామినేషన్ల దాఖల పర్వం పూర్తయింది. ఈ సందర్భంగా బీజేపీ బలపర్చిన అభ్యర్థి సామ రాజిరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం లాంఛనమే కానుంది.సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే ఆయా గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులు కేటాయిస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో బీజేపీ తరఫున తొలి ఏకగ్రీవం కావడంతో ఇచ్చిన మాట మేరకు పీచుపల్లికి నిధులు అందజేస్తానని ఆయన తెలిపారు.మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల్లేకుండా సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యే గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులు ఇస్తామని ప్రకటించింది. ఈ లెక్కన పీచుపల్లి గ్రామానికి మొత్తం రూ.20 లక్షల ప్రోత్సాహక నిధులు అందనున్నాయి.గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించే పనిలో గ్రామస్తులు ఇప్పటికే నిమగ్నమయ్యారు. ఈ నిధులను వినియోగించి తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని వారు తెలిపారు.

## మద్దిమడుగు అంజనేయ స్వామిని దర్శించిన గువ్వల బాలరాజు



**అమ్రాబాద్, నవంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బీజేపీ నాయకులు, అచ్చంపేట మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రవి ముదిరాజు, ఆనంద్, రామోజీ, గోలి శ్రీను, శంకర్ మాదిగ, మహేందర్, రవి, అంజి, చౌట శివ తదితరులు పాల్గొన్నారు.

## అమ్రాబాద్ మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా చిగుర్ల కోటయ్య




**అమ్రాబాద్, నవంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్ అభ్యర్థిగా చిగుర్ల కోటయ్యను ప్రతిపాదించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆయనను అధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. అభ్యర్థిగా ప్రకటించినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు గ్రామస్థులు.ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో చిగుర్ల కోటయ్యకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేసి భారీ మెజారిటీతో విజయం సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బాల్ లింగం గౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు వెంకటయ్య, మాజీ కో–ఆప్షన్ మెంబర్ ముక్రం ఖాన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతల రాజగోపాల్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు నిరంజన్, గోలి సురేష్, నోముల సురేష్, సయ్యద్ ఆరిఫ్, జమీల్, మాకబుల్ అహ్మద్, గౌస్, ఇస్మాయిల్, లక్ష్మణ చారి, అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నందయ్య ను సన్మానించిన పాషా

**కోరుట్ల నవంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ (డిసి సి) అధ్యక్షుడు గజేంగి నందయ్య ని పట్టణ మాజీ కాంగ్రెస్ అధ్యక్షు డు మహ్మద్ ఖుతూబోద్దిన్ పాషా మర్యాదపూర్వకంగా కలిసి ఘనం గా సన్మానించారు.బుధవారం పట్ట ణంలోని టిపిసిసి డెలిగేట్ కల్వకుం ట్ల సుజీత్ రావు నివాసానికి వచ్చి న నందయ్యను పాషా కలసి శాలు వాతో సన్మానించారు.ఈ కార్యక్ర మంలో పలువురు ఉన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో బారీగా చేరికలు

-ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి.
-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.



**దేవరకొండ డిసెంబర్ 03. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ప్రజల సమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ పార్టీని స్థానిక ఎన్నికల్లో తరిమికొడదాం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం దేవరకొండ పట్టణంలోనీ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో డిండి మండలం కందుకూరు గ్రామానికి చెందినశ్రీకాంత్ తోపాటు 50 మంది యువకులు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. బీఆర్ఎస్ లో చేరిన నాయకులకు గులాబీ కండువాలను కప్పి మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ తమ పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మోసకారి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి అని ఆయన అన్నారు.అసమర్ధ కాంగ్రెస్ పాలనలో సబ్బండ వర్గాలకు అన్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు విసుగు చెందారు అని ఆయన తెలిపారు.ఆరు గ్యారంటీల మోసాన్ని, 420హామీలను ప్రజలకు వివరించాలి అని ఆయన పిలుపు నిచ్చారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయింది అని ఆయన అన్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని ఆయన తెలిపారు.ప్రతీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటా అని ఆయన తెలిపారు.తెలంగాణలో రైతుల కన్నీటి గాధ అని,కాంగ్రెస్ ప్రభుత్వం పై తిరగబడుతున్న తెలంగాణ ప్రజలు అని ఆయన గుర్తు చేశారు.ఎన్నికల మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదా రేవంత్ ప్రభుత్వానికి లేదు అని ఆయన అన్నారు.ఇది ప్రజా ప్రభుత్వం కాదు, పనికిరాని ప్రభుత్వం అని ఆయన పేర్కొనారు.కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో తెలంగాణలో సబ్బండవర్గాలు ఆందోళన బాట పట్టాయి అని ఆయన తెలిపారు.స్వరాష్ట్రం ఏర్పడిన అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో పదేండ్ల పాటు అభివృద్ధి మార్గంలో పరుగులు తీసిన తెలంగాణ అని ఆయన గుర్తు చేశారు.నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వల్ల సంక్షోభంలో కూరుకుపోయింది అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర్ రావు, ఉప్పుగంటి ప్రశాంత్ రావు, రాఘవ చారి, పెద్దయ్య, ప్రవీణ్,తదితరులు ఉన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



ఆర్ పి లు రేణుక,రాణి లకు స్వీట్లు ఇస్తున్న చిప్పల శ్రీధర్ తుక్కోజీ అమరేందర్..



**బోడుప్పల్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా డ్వాక్రా భవనంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు మెప్మా పట్టణ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీవో భార్గవి మాట్లాడుతూ, దివ్యాంగులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా సమాఖ్య పొదుపు సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష మంది మహిళలను కోటీశ్వర్లుగా తీర్చిదిద్దే సంకల్పం చేసినట్లు తెలిపారు. దివ్యాంగుల కోసం కూడా పొదుపు సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, అందుకు అందరి సహకారం అవసరమని అన్నారు. దేవుడు ఒక వైకల్యం ఇచ్చినప్పటికీ పది రెట్లు ధైర్యం, తెలివి ప్రసాదిస్తాడని పేర్కొన్నారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి బోడుప్పల్‌లో ప్రతి దివ్యాంగుడు పొదుపు సంఘంలో సభ్యుడిగా ఉండాలని ఆకాంక్షించారు.బోడుప్పల్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిప్పల శ్రీధర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో ఈ వేడుకలు జరుపుకుంటామని, కానీ ఈసారి ప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళా సమాఖ్య నుంచి అధికారిక ఆహ్వానం రావడం ఆనందకరమని అన్నారు. దివ్యాంగుల పొదుపు సంఘాల ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్పీ రేణుక ప్రత్యేకంగా ఆహ్వానం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఉపాధ్యక్షుడు తుక్కోజ అమరేందర్ మాట్లాడుతూ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ వేడుక జరగడం సంతోషకరమని, 2003లో కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో “కృషి వికలాంగుల పొదుపు సంఘం” ఉండేదని, కొన్ని కారణాల వల్ల ఆగిపోయిందని, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం మరోసారి మంచి అవకాశం కల్పించిందని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పీడీ అనిల్ కుమార్, సీవీవో భార్గవి, సీఎల్ఆర్పీలు లక్ష్మీ, ఇంద్ర, ఈదుల రేణుక, లత, రాణి, వసంత, సంధ్య, సునీత, వీణా, మంజుల, సుజాత, నర్సీన్, సుధాకర్, చిత్తారి అనిత, బంగారి అనిత, అలాగే దివ్యాంగుల నాయకులు ప్రధాన కార్యదర్శి ఆవుల పాండు యాదవ్, వల్లపు నాగేష్ యాదవ్,కిషోర్, శేఖర్ రెడ్డి, బాలన్న, మూగ రమేష్, బాలు, గంగమ్మ, రేవతి, విజయ రాణి, లింగం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాసోజు శ్రీకాంత్ చారి 16వ వర్ధంతి



**అచ్చంపేట, డిసెంబర్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ మలి దశ ఉద్యమ వీరుడు కాసోజు శ్రీకాంత్ చారి 16వ వర్ధంతి సందర్భంగా అచ్చంపేట పట్టణంలో అమరవీరుల స్థూపం వద్ద కార్యక్రమం ఘనంగా జరిగింది. విశ్వ బ్రాహ్మణులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కలిసి అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పూలమాలలు అర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమ నాయకుడు మహబూబ్ అలీ మాట్లాడుతూ, తెలంగాణ సాధనలో శ్రీకాంత్ చారి తన ప్రాణాలను లెక్కచేయకుండా త్యాగం చేశారని, కానీ గత ప్రభుత్వం ఆయన కుటుంబానికి గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. శ్రీకాంత్ చారి తల్లి శంకరమ్మకు నామినేటెడ్ పదవి ఇవ్వడం ద్వారా కుటుంబాన్ని గౌరవించాలని, ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన అభిలషించారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం నాయకులు కందుకూరి నాగరాజు, మిడ్జిల్లా మాధవాచారి, కపిలవాయి ఉమాశంకర్, డాక్టర్ విష్ణుమూర్తి, కాకునూరు శ్రీనివాసచారి, రేసోజు మురళి, ఉప్పునుంతల శ్రీనివాస్ ఆచారి, కాసోజు వీరాచారి, దేవ పూజ వినోద్, చేపూరి జంగా చారి శేఖర్, చింతోజు శ్రీనివాసులు, కొండూరు శేఖర్, ఉద్యమ నాయకులు మహబూబ్ అలీ, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ అధ్యక్షునిగా మందల లక్ష్మీనారాయణ



**ఎలిగేడు, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎలిగేడు గ్రామానికి చెందిన మందల లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని, తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన సంఘంలోని బాధ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఎన్నిక పట్ల ఎలిగేడు గ్రామస్తులు, మిత్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## లష్కర్ గూడ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా అల్లే ఐలయ్య యాదవ్



**అబ్దుల్లాపూర్ మెట్,డిసెంబర్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ మండలం లస్కర్ గూడ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా గ్రామానికి చెందిన అల్లే ఐలయ్య యాదవ్ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు.సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అల్లే ఐలయ్య మాట్లాడుతూ అవకాశం ఇవ్వండి గ్రామాన్ని అభివృద్ధి చేస్తా అనే నినాదంతో ప్రజల్లో కి వెళ్తున్నానని.. గ్రామ అభివృద్ధి నే లక్ష్యంగా చేసుకొని సిసి రోడ్లు,డ్రైనేజీలు వాడవాడల విద్యుత్ వసతులు, యువతకు ఉపాధి, నిరుపేద కుటుంబాలకు సయా సహకారాలు అందిస్తానని అన్నారు. మన గ్రామ అభివృద్ధి లో పెండింగ్ లో ఉన్న సమస్యలు తీర్చేందుకు సమన్వయంతో ముందుకు వెళ్తానని..రాజకీయాలకన్న ప్రజలకు సేవ చేస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అల్లే యాదయ్య యాదవ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షుడు సుర్వి సుదర్శన్ గౌడ్, మెండు సుదర్శన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కొండల్ గౌడ్, గుండె నరసింహ. అల్లే సాయి యాదవ్, బిక్షపతి యాదవ్ ఎండి ఆఫీస్, తో పాటు గ్రామ యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలి

-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్.



**దేవరకొండ డిసెంబర్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా,చింతపల్లి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు మహమ్మద్ సర్వర్, బిఆర్ఎస్ పార్టీ యూత్ కార్యదర్శి ఆంజనేయులు లతో పాటు 30 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీని వీడి ఎమ్మెల్యే బాలు నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా వాళ్లకి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ లోకి చేరుతున్నారన్నారు.
ప్రజలతో మమేకమై,అభివృద్ధి పథంలో ముందుకు సాగిస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పట్ల విశ్వాసంతో బిఆర్ఎస్,బీజేపీ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి అని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజల అభ్యున్నతికి తీసుకుంటున్న నిర్ణయాలు ప్రతి వర్గానికీ మేలు జరుగుతున్నాయి అని తెలిపారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.అలాగే, కొత్తగా చేరిన కార్యకర్తలకు స్వాగతం పలుకుతూ పాత, కొత్త లేకుండా అందరూ కలిసి కట్టుగా సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు,మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జోహార్ శ్రీకాంతాచారి




**మిర్యాలగూడ, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తుదిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి విద్యార్థి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించారు. టిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారని, ఆ త్యాగాల్లో శ్రీకాంత్ చారి గారి ఆత్మార్పణం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన త్యాగం వల్లే తెలంగాణ కల సాకారమైందని, విద్యార్థి నాయకుడిగా ఆయన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.కార్యక్రమంలో టిఆర్ఎస్ అధికార ప్రతినిధి పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, మిర్యాలగూడ మండల టిఆర్ఎస్వి అధ్యక్షులు చిన్నాల అంజి యాదవ్, బీఆర్ఎస్వీ మండల ఉపాధ్యక్షులు దొండ సురేష్ యాదవ్, ఫయాజ్, వెంకట సాయి, భరత్, హరీష్, సాయి కుమార్ రెడ్డి, వినోద్, పవన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ పగ్గాలు ఎవరికి?



**పాలకుర్తి, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పాలకుర్తి మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. నామినేషన్ల ప్రక్రియ పూర్తయి, ఉపసంహరణ తర్వాత గుర్తుల కేటాయింపుతో అసలైన ప్రచారం మొదలైంది. మాజీలలో మరోసారి విజయం సాధించాలని కసి, కొత్త అభ్యర్థులు పంచాయతీ పగ్గాలు కైవసం చేసుకోవాలని ఉత్సాహం చూపిస్తున్నారు.ఇప్పటికే మందు, విందులతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు జరుగుతుండగా, ఒక్కో గ్రామంలో పదుల సంఖ్యలో నామినేషన్లు రావడం ఓటర్లకు తలనొప్పిగా మారింది. అభ్యర్థులు పడే పాట్లు ఇంతింత కాకుండా, ఓటర్లు గెలుపోటముల తర్వాత ఒకరి ముఖం ఒకరు చూడాల్సి వస్తుందని జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య పాలకుర్తి పంచాయతీ పగ్గాలు ఎవరికి దక్కుతాయనేది ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది.

## ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై బిజెపి నాయకులు ధర్నా



**జగిత్యాల, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హిందూ దేవతలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జగిత్యాల తహసిల్ చౌరస్తా వద్ద బిజెపి పట్టణ శాఖ అధ్యక్షుడు కొక్కు గంగాధర్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు పాల్గొని మాట్లాడుతూ, హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి మాట్లాడడం బాధాకరమని, వెంటనే హిందూ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు పాల్గొన్నారు. ఆముద రాజు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు.

## బీఆర్ఎస్ క్షీణత, కాంగ్రెస్‌లో చేరికలు



**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కరీంనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్ కేడర్‌లో నిరాశ నిస్పృహ అలుముకుందని, వారిని పట్టించుకునే నాయకత్వం లేకపోవడంతో పార్టీపై ప్రజల్లో విశ్వాసం తగ్గిపోయిందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఖాజీపూర్ సర్పంచ్ అభ్యర్థి సోమినేని తిరుపతి బుధవారం వెలిచాల రాజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. తిరుపతి మాట్లాడుతూ బీఆర్ఎస్ విధానాలు నచ్చక, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నానని తెలిపారు. రాజేందర్ మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ పని అయిపోయిందని, ప్రజలు పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పెద్ద ఎత్తున విజయం సాధిస్తారని, పార్టీ మరింత బలపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## దామెర గ్రామ రాజకీయాల్లో కీలక మార్పు




**హుస్నాబాద్ , డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో గ్రామ రాజకీయాల్లో పెద్ద మార్పు చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ అధ్యక్షుడు సాతురి ప్రభాకర్ భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమటిరెడ్డి రాంబోపాల్ రెడ్డి సాతురి ప్రభాకర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం బీజేపీ చేస్తున్న కృషి, కేంద్రం చేపడుతున్న ప్రజాప్రయోజన కార్యక్రమాలు తనను ఆకర్షించాయని, అందుకే పార్టీలో చేరానని తెలిపారు. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపడేందుకు తన చేరిక కీలకమని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దామెర శక్తికేంద్ర ఇంచార్జ్ ఠాకూర్ శామ్ సింగ్, మాజీ సర్పంచ్ చల్ల రవీందర్ రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు అంబీర్ శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## కాసోజు శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**పెద్దపల్లి, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక మంది అమరులు ప్రాణత్యాగం చేశారని, వారిలో తొలి అమరుడైన శ్రీకాంతాచారి మరణం యావత్ దేశాన్ని ఆలోచింపజేసిందని పేర్కొన్నారు. ప్రపంచ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రజలు తమ ఆత్మగౌరవం కోసం పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని కొనియాడారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను గుర్తించి, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, అమరుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సబ్బెడ చంద్రకళ, గోగుల రాజిరెడ్డి, డా. మంద భాస్కర్ యాదవ్, తాడూరి శ్రీమన్, దామ సదయ్య, సిలివేరి సుధాకర్, బోర్ల ధనంజయ్, తీట్ల మల్లేశం, ములుగురి నర్సయ్య, చంటి నరసక్క, ఎండి ఖతిజ, గడ్డం లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానాలు



**పెద్దపల్లి, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: పెద్దపల్లి ఎంపీ డా. గడ్డం వంశీకృష్ణ, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మరియు తెలంగాణకు చెందిన ఇతర ఎంపీలు కలిసి నేడు న్యూఢిల్లీలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీను మర్యాదపూర్వకంగా కలిశారు. డిసెంబర్ 8-9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 కు హాజరుకావాలని ఆహ్వానించారు. అనంతరం పార్లమెంట్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వే, ఐటీ & సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, గృహనిర్మాణ & పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్లను విడివిడిగా కలసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ సమావేశాల్లో సమ్మిట్‌లో ఆవిష్కరించనున్న “తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్”, రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడి అవకాశాలు, పరిశ్రమల విస్తరణ, భవిష్యత్ ప్రాధాన్యత అంశాలపై విశ్లేషణాత్మక చర్చ జరిగింది. ఈ గ్లోబల్ సమ్మిట్ తెలంగాణ అభివృద్ధి దిశలో ఒక ప్రధాన మైలురాయిగా నిలుస్తుందని, రాష్ట్ర భవిష్యత్ ప్రగతికి కేంద్ర -రాష్ట్ర సమన్వయం అత్యంత కీలకం అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు

# కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో రూమ్లో వినియోగంపై నిషేధం

**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్లు, పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ వినియోగంపై నిషేధం విధించారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 31 వరకు అమల్లో ఉంటాయని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో వీటిని వినియోగిస్తున్నప్పటికీ, అసాంఘిక శక్తులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. వినియోగించదలచిన వారు ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై నిషేధాన్ని కూడా పొడిగించారు. మద్యం సేవించి అసభ్య ప్రవర్తనతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, ప్రజల భద్రత కోసం ఈ చర్యలు



తీసుకున్నామని కమిషనర్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సభలు, సమావేశాలు, ఊరేగింపులు అనుమతి లేకుండా నిర్వహించరాదని హెచ్చరించారు. ఆయుధాలు ధరించి సంచరించడం, రోడ్లపై జనసమీకరణ చేయడం నిషేధమని స్పష్టం చేశారు. డిజె సౌండ్ వినియోగంపై కూడా నిషేధాన్ని ఈ నెల 31 వరకు పొడిగించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్దకాలుష్యాన్ని నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అవసరమైతే సంబంధిత ఎసిపిల అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు.

# పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఆర్‌పిఐ నిరసన



**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలపై చేసిన వ్యాఖ్యలకు వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, మేధావులు, కుల సంఘాలు కలిసి ఎన్నో సంవత్సరాల పోరాటం ద్వారా సాధించుకున్నారని గుర్తుచేశారు. ఆ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశంతో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అమాయకత్వం అని, వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రంలో అడుగు పెట్టనివ్వరని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచి మాట్లాడడం సరైంది కాదని, ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలు సహించరని ఆయన స్పష్టం చేశారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల బందోబస్తుపై సమీక్ష




**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అధికారులను ఆదేశించారు. సీపీ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించాలని సూచించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా భద్రత కల్పించాలని అన్నారు. రూట్ మొబైల్ బృందాల పాత్ర కీలకమని, నిర్ణీత రూట్లలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించి ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు జరగకుండా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా కఠినంగా వ్యవహరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసీపీలు శ్రీనివాస్, విజయకుమార్, మాధవి, ఇన్స్పెక్టర్లు మరియు ఇతర ఎన్నికల విభాగాధికారులు పాల్గొన్నారు.

# అనుమతి లేని ఒడిసి హై స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్





**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: పర్మిషన్ లేకుండా గత కొన్ని సంవత్సరాలుగా నడుస్తున్న ఒడిసి హై స్కూల్ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని ఆరోపిస్తూ, ఆ పాఠశాలను వెంటనే మూసివేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పిడిఎస్యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. పాఠశాల పక్కనే విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఉండటం వల్ల ప్రమాదం పొంచి ఉందని, విద్యుత్ అధికారులు దానిని వేరే చోటుకు మార్చాలని ఆయన కోరారు.



అనుమతి లేని పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని, మున్సిపల్ మరియు విద్యుత్ అధికారులు తక్షణమే నోటీసులు జారీ చేసి పాఠశాలను ఖాళీ చేయించాలని ఆయన స్పష్టం చేశారు. విద్యాధికారులు విద్యార్థుల జీవితాలకు న్యాయం చేయాలని, అనుమతి లేని పాఠశాలలను గుర్తించి సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆ పాఠశాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంజి, శేఖర్, అశోక్, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ పమేలా సత్పతి పాటతో దివ్యాంగులకు స్ఫూర్తి



**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అంధుల పాఠశాల విద్యార్థిని సింధుశ్రీతో కలిసి పాట పాడారు. దివ్యాంగులలో స్ఫూర్తి నింపేందుకు ఈ పాటను యూట్యూబ్‌లో పోస్ట్ చేశారు. 2009లో విడుదలైన నింగినేల నాదే సినిమాలో గేయరచయిత చంద్రబోస్ రాసిన "ఆరాటం ముందు ఆటంకం ఎంత?" అనే పాటను కలెక్టర్ ఆలపించారు. గతంలో ఒక కార్యక్రమంలో సింధుశ్రీ పాట పాడటం చూసి ప్రేరణ పొందిన కలెక్టర్, ఆమెతో కలిసి ఈ పాటను రికార్డు చేయించారు. కరీంనగర్ అంధుల పాఠశాల మ్యూజిక్ టీచర్ సరళ, స్థానిక సంగీత దర్శకుడు కేబీ శర్మ ఆధ్వర్యంలో టెక్నిషియన్లు ఈ రికార్డింగ్ చేశారు. ఇంతకుముందు కూడా కలెక్టర్ పమేలా సత్పతి పాడిన "ఓ చిన్నీ పిచుక" పాటకు విశేష ఆదరణ లభించింది.

# బిఆర్ఎస్ నేత బిజెపిలో చేరిక



**బద్దిపెల్లి, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ మండలం రూలర్ బద్దిపెల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు తాండ్ర రాజశేఖర్ తన అనుచరులతో కలిసి బుధవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బిజెపిలో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా రాజశేఖర్ బరిలోకి దిగారు. ఈ కార్యక్రమంలో మండల ఎలక్షన్ ఇన్చార్జి పొన్నం వెంకట రమణ, మండల అధ్యక్షుడు కుంట తిరుపతి, మాజీ అధ్యక్షుడు కడార్ల రతన్ కుమార్, జిల్లా కౌన్సిల్ మెంబర్ వేముల అనిల్, శక్తి కేంద్ర ఇన్చార్జి పొర్తి అనిల్, డాక్టర్ సునీల్ మంగళం, పోరెడ్డి నరేందర్ రెడ్డి, బూత్ అధ్యక్షులు, ఆరు గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాచారం మండలంలో విద్యుత్ అంతరాయం

**యాచారం, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా యాచారం మండల పరిధిలోని చింతుల్ల 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని అధికారులు తెలిపారు. చింతుల్ల 11 కేవీ ఫీడర్, చింతుల్ల ఇన్డస్ట్రియల్ ఫీడర్, ధర్మన్నగూడ ఫీడర్ (చింతుల్ల, పెద్దతండ్లా ప్రాంతాలు) పై మరమ్మత్తులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఈరోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుంది. ఈ అంతరాయం గృహాలు, కోళ్ల ఫారాలు, రైస్ మిల్లులు, వ్యవసాయ పోలాలకు ప్రభావం చూపనుంది. వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బిజెపి నిరసన



**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు



గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ వద్ద బుధవారం బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, గతంలో కేసీఆర్ హిందువులను చులకన చేసిన వ్యాఖ్యలు చేసినప్పుడు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, ఆ పార్టీ కాలగర్భంలో కలిసిపోయిందని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి కూడా అదే బాటలో నడుస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందూ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, ఇతర మతాల గురించి మాట్లాడే ధైర్యం ఉందా అని ఆయన ప్రశ్నించారు. హిందూ సమాజంతో పెట్టుకుంటే గతంలో కేసీఆర్‌కు జరిగినట్లే రేవంత్ రెడ్డికి కూడా అదే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్, వాసాల రమేష్, కళ్లెం వాసుదేవరెడ్డి, గువ్వల శ్రీనివాస్, కటకంలోకేష్, పాదం శివరాజ్, బండారు గాయత్రి, తణుకు సాయి కృష్ణ, అవదుర్తి శ్రీనివాస్, నాంపల్లి శ్రీనివాస్, ప్రసన్న, యువ క్రాంతి, అక్షయ్, కట్ట రాజు, బోయిన్ శ్రీను, జి రవి, పాశం తిరుపతి, ఆకుల నరేష్, అజయ్, వెంకటేష్, సందీప్, శ్రీధర్, అనిల్, విజయ్, కలికోట మోహన్, నారాయణ, జిత్తు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా




**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర



ప్రభుత్వం దివ్యాంగులకు అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు. ఉన్నత చదువులు చదివేలా సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తామని, ఇందిరమ్మ ఇళ్లలో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బధిరుల ఆశ్రమ పాఠశాలలో ఇంటర్ తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, సైన్ లాంగ్వేజ్ ద్వారా బోధనకు నిపుణులను నియమిస్తామని వివరించారు. దివ్యాంగుల సంక్షేమానికి 50 కోట్లు కేటాయించామని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా "దివ్య దృష్టి" యూట్యూబ్ ఛానల్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌లో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, వైద్య సేవలు, చదువు బాధ్యతలు ప్రభుత్వం చూసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

# సీఎం సభపై తీవ్ర నిరసన



**హుస్నాబాద్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సీఎం బహిరంగ సభ పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లలో ఉంచడం తీవ్రంగా ఖండిస్తున్నామని భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టడం ప్రజా పాలన కాదని, ఆర్టీసీ బస్సులను నిలిపివేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన విమర్శించారు. హుస్నాబాద్‌లో రెండు సంవత్సరాల ప్రజాపాలన ఉత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రోడ్డు ప్రక్కన సభ పెట్టడం ప్రజలకు ఇబ్బందికరమని పేర్కొన్నారు. రహదారులు మూసివేయడం, పోలీసుల డైవర్షన్లతో గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అభివృద్ధి పేరుతో శంకుస్థాపనలు మాత్రమే జరుగుతున్నాయని, పనులు పూర్తి కాలేదని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేసి నిర్బంధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ఇకపై ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి సభలు నిర్వహించవద్దని వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

# సీఎం సభకు ముందస్తు అరెస్టులు

## -ప్రతిపక్షాల ఆగ్రహం




**హుస్నాబాద్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర ముఖ్యమంత్రి హుస్నాబాద్ పర్యటన సందర్భంగా బిఆర్ఎస్, బిజెపి, ఏబివిపి నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం ప్రతిపక్షాల ఆగ్రహానికి కారణమైంది. అభివృద్ధి కార్యక్రమాల పేరిట సీఎం పర్యటన జరుగుతున్నా, వాస్తవానికి సర్పంచ్ ఎన్నికల ప్రచారమే లక్ష్యమని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పరిపాలన పేరుతో కక్ష సాధింపు పాలన కొనసాగిస్తోందని, అభివృద్ధి పేరుతో శంకుస్థాపనలు మాత్రమే చేసి పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. గౌరవెల్లి ప్రాజెక్టు, పట్టణంలోని సి.సి. రోడ్లు, మురికి కాలువలు, 250 పడకల ఆసుపత్రి వంటి పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని, ప్రజలను మభ్యపెట్టడమే కాంగ్రెస్ ఉద్దేశమని పేర్కొన్నారు. సీఎం సభకు ముందు బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎమ్.ఏ. అన్వర్ పాషా, నియోజకవర్గ ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి, మాజీ ఎమ్‌పిపి ఆకుల వెంకట్, మాజీ జడ్‌పిటిసి బీలు నాయక్, భూక్యా లక్ష్మణ్ నాయక్, బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, ఏబివిపి నాయకులు కంసాని రాకేష్, భీమగోని చరణ్, చెన్నూరి రాజేష్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు విఫలమవుతాయని, రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పేలా ప్రజలు తీర్పు ఇస్తారని ప్రతిపక్షాలు హెచ్చరించాయి.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ కాలు పంపిణీ




**నిజామాబాద్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ జగిత్యాల సెంట్రల్ సంయుక్త ఆధ్వర్యంలో, రోటరీ సర్వీసెస్ ట్రస్ట్ సహకారంతో ఉచిత కృత్రిమ కాలు (జైపూర్ ఫుట్) పంపిణీ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ దివ్యాంగులకు కృత్రిమ కాలును అందజేశారు. రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని, 2009 నుండి కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగుల పునరావాసం, సాధికారత కోసం రోటరీ చేస్తున్న కృషి సమాజానికి ఆదర్శమని అన్నారు. నిజామాబాద్ రోటరీ సర్వీసెస్ ట్రస్ట్‌కు ప్రతి సంవత్సరం రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. అదేవిధంగా అవసరమైన సహాయ సహకారాలన్నీ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌సిటి చైర్మన్ ఆకుల అశోక్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్ అగర్వాల్, కార్యదర్శి గోవింద్ జవహర్, కోశాధికారి జుగల్ రాజు, బీజేపీ నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతిని మోసం చేసిన యువకుడి అరెస్టు

**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన నగునూరుకు చెందిన బత్తిని శ్రావణ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆసిఫాబాద్‌కు చెందిన 19 ఏళ్ల యువతి ప్రతిమ హాస్పిటల్‌లో చికిత్స కోసం వచ్చిన సమయంలో రిసెప్షన్‌లో పనిచేస్తున్న శ్రావణ్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి, వివాహం చేస్తానని నమ్మించి పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. తరువాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి యువతిని పట్టించుకోలేదు. నవంబర్ 21న శ్రావణ్ ఇంటికి వెళ్లిన యువతి జరిగిన విషయాన్ని అతని తల్లిదండ్రులకు చెప్పగా, వారు ఆమెను వెనక్కి పంపించారు. దీంతో బాధితురాలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శ్రావణ్ తన మిత్రుల సమక్షంలో రెండు సంవత్సరాల తర్వాత పెళ్లి చేసుకుంటానని, అప్పటివరకు ఖర్చులు భరిస్తానని రాతపూర్వకంగా ఇచ్చినా, మరుసటి రోజు నుంచి మళ్లీ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. బాధిత యువతిని వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# బిజెపిలో భారీ చేరికలు, నామినేషన్లు





**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో పలు ప్రాంతాల్లో బిజెపి అభ్యర్థులు నామినేషన్లు వేస్తూ, కొత్తగా చేరికలు జరుగుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం పోతరెడ్డిపల్లి గ్రామంలో బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి చిన్న మేని మౌనిక కిషన్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు తిరుపతి రవి, సంతోష్, వినోద్, వంతడుపుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అదే రోజు వేములవాడ నియోజకవర్గం వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో చీర్లవంచ గ్రామానికి చెందిన బిజెపి అభ్యర్థి చల్ల వైష్ణవి సమక్షంలో దాదాపు 100 మంది మహిళలు, యువకులు బిజెపిలో చేరారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంత్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, సీనియర్ నాయకులు టేకు జంపరాజు, చల్ల బిక్షపతి, చల్లా రాములు, చల్లా రవి, లక్ష్మీ, దుర్గయ్యతో పాటు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్దిపేటలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియపై కలెక్టర్ పరిశీలన



**సిద్దిపేట, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల భాగంగా మూడవ విడత నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి బుధవారం కోహెడ మండలంలోని సముద్రాల, బస్వాపూర్ క్లస్టర్లలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సముద్రాల క్లస్టర్‌లో సముద్రాల, చెంచేల్ చెర్వుపల్లి, మైసంపల్లి గ్రామాలు, బస్వాపూర్ క్లస్టర్‌లో బస్వాపూర్, నాగసముద్రల, పోరెడ్డిపల్లి, బత్తులవానిపల్లి, ఆరెపల్లి గ్రామాల నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో రెండు విడతల నామినేషన్ ప్రక్రియ పూర్తయిందని, మూడవ విడతలో అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, మద్దూరు, కొమురవెల్లి, చేర్యాల, దుల్మిట్ట, కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో 163 గ్రామపంచాయతీలు, 1432 వార్డులకు డిసెంబర్ 3 నుంచి 5 వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు.అభ్యర్థుల తాకిడి ఎక్కువగా ఉంటే రెండు కౌంటర్ల ద్వారా నామినేషన్లు స్వీకరించాలని, ప్రతి అప్లికేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి రిసీవ్డ్ స్లిప్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. క్లస్టర్ చుట్టూ 100 మీటర్ల పరిధిలో బందోబస్తు ఏర్పాటు చేసి, అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతించాలని పోలీసు అధికారులకు సూచించారు.

# ట్రినిటీ స్కూల్‌లో గ్రీన్ డే వేడుక



**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచ నేల దినోత్సవం (డిసెంబర్ 5)ను పురస్కరించుకొని ట్రినిటీ – ది స్కూల్ ఆఫ్ లెర్నింగ్, సాలెహ్‌నగర్‌లో ముందస్తుగా గ్రీన్ డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో పువ్వుల మొక్కలు, షో మొక్కలు నాటి మట్టి సంరక్షణ ప్రాముఖ్యతపై పోస్టర్లను ప్రదర్శించారు. చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి, మట్టి ప్రాధాన్యం, రసాయన పురుగుమందుల దుష్ప్రభావాలు, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే కాలుష్యం, ఆర్గానిక్ వ్యవసాయం అవసరాన్ని వివరించారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థులు "సేవ్ సాయిల్ – సేవ్ ఎర్త్", "నో సాయిల్ – నో ఫుడ్" వంటి నినాదాలతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.అతిథుల హాజరు విద్యార్థులకు ప్రేరణనిచ్చి, పచ్చదనమైన భవిష్యత్తు కోసం అవగాహన విత్తనాలు నాటిన వేడుకగా నిలిచింది.

# రక్తదానం వల్ల లాభాలు

## గాలిపెల్లి కుమార్



**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: రక్తదానం చేసిన ప్రతిసారి ముగ్గురు బాధితుల ప్రాణాలను కాపాడినట్లేనని సామాజిక వేత్త గాలిపెల్లి కుమార్ తెలిపారు. తరచుగా రక్తదానం చేయడం వల్ల క్యాన్సర్ ముప్పు తగ్గుతుందని, సంవత్సరంలో ఒక్కసారైనా రక్తదానం చేస్తే గుండెపోటు ప్రమాదం 88 శాతం మేర తగ్గుతుందని చెప్పారు. రక్తంలో అధిక ఇనుము నిల్వలు తగ్గడం వల్ల రక్తనాళాలు ఆరోగ్యంగా ఉంటాయని, కాలేయానికి మేలు జరుగుతుందని వివరించారు. ఎముక మజ్జ కొత్త ఎర్ర రక్తకణాలను ఉత్పత్తి చేస్తుందని, ఒక్కసారి రక్తదానం చేయడం ద్వారా 650 కిలోకేలరీలు తగ్గి శరీర బరువు అదుపులోకి వస్తుందని తెలిపారు. ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందం కలిగించే రక్తదానం వెలకట్టలేని సంతృప్తిని ఇస్తుందని, ప్రతి ఇంటి నుంచి ఒక రక్తదాతను తయారు చేయడమే తన లక్ష్యమని కుమార్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు 54 సార్లు రక్తదానం చేసినా తాను ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు.

# పంచాయితీ ఎన్నికల సెలవులు ప్రకటన



**మంచిర్యాల, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: రెండవ సాధారణ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ ప్రక్రియకు అనుగుణంగా సెలవులు ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. పోలింగ్ ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజా భవనాలకు పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవు ప్రకటించారు. దండేపల్లి, హాజీపూర్, జన్నారం, లక్షెట్టిపేట మండలాల్లో డిసెంబర్ 10 స్థానిక సెలవు, 11 పోలింగ్ రోజు సెలవు. బెల్లంపల్లి, భీమిని, కన్నేపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూర్, వేమనపల్లి మండలాల్లో డిసెంబర్ 13 స్థానిక సెలవు, 14 పోలింగ్ రోజు సెలవు. భీమారం, జైపూర్, చెన్నూరు, కోటపల్లి, మందమర్రి మండలాల్లో డిసెంబర్ 16 స్థానిక సెలవు, 17 పోలింగ్ రోజు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

# హుస్నాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగం


**హుస్నాబాద్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రాంతం సర్దార్ సర్వాయి పాపన్న నేతృత్వంలో బహుజన రాజ్యానికి పునాదులు వేసిన గడ్డ అని, తెలంగాణ రాష్ట్ర సాధనలో కరీంనగర్ ప్రజలు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. సోనియా గాంధీ ఇచ్చిన మాటతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఆమెను కలసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానించానని తెలిపారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ప్రధాని మోడీని కూడా ఆహ్వానించానని చెప్పారు. డిసెంబర్ 3 ప్రత్యేకతను ప్రస్తావిస్తూ, ప్రజలు ఓటును ఆయుధంగా మార్చి దుర్మార్గ పాలనను




అంతమొందించిన రోజు ఇదని, శ్రీకాంతాచారి అమరత్వం తెలంగాణ సాధనలో కీలకమైందని అన్నారు. ఆయన ఆశయ సాధనలో భాగంగా మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. బీఆరెస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు విఫలమైందని, కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరలేదని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి, ఇప్పటి వరకు 1.04 లక్షల కోట్లు రైతుల కోసం ఖర్చు చేశామని, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కోసం రూ.8 వేల కోట్లు వెచ్చించామని వివరించారు. లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, పేదలకు సన్న బియ్యం, 50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. గత పాలకులు హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేశారని, కానీ తాము ఎన్ని నిధులైనా ఖర్చు చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో మంచివారిని ఎన్నుకోవాలని, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసే వారిని సర్పంచులుగా ఎన్నుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# కరీంనగర్‌లో సీఎం రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ నాయకుల ఆగ్రహం

**కరీంనగర్, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హిందు దేవతలను కించపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మాజీ మేయర్ యాదగిరి సునీల్ ఓ పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.సునీల్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు అండగా ఉన్నా ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ హిందువులను కించపరిచేలా దేవతలపై వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని



అన్నారు. దేశంలో మానవ సమాజం సంక్షేమం కోరే వారు హిందు దేవుళ్లని, ముఖ్యమంత్రి పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.అలాగే, కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం తో కుమ్మక్కై జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అభ్యర్థిని పోటీలో దింపిందని ఎద్దేవ చేశారు. ఎంఐఎం తో కుమ్మక్కైనా అభ్యంతరం లేదని, కానీ హిందు సమాజాన్ని కించపరచడం సహించేది కాదని హెచ్చరించారు.రాబోయే రోజుల్లో హిందు సమాజం అంతా ఏకమై కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హిందు దేవతలపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని హిందువులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డి హిందువులకు క్షమాపణ చెప్పాలి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ**



**వరంగల్, డిసెంబర్ 03(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కాదు రివంతుద్దీన్ గా మార్చుకుంటే బాగుంటుంది అని, ఒక సీఎం హోదాలో ఉంది హిందూ మనోభావాలు దెబ్బేతీసే విధంగా మాట్లాడడం సిగ్గు చేటు అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ అన్నారు.ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి హిందువులకు బేషరతుగా క్షమాపణలు చెప్పి, ముక్కు నేలకు రాయలని, లేనిపక్షంలో నిన్ను తెలంగాణలో ఏక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.ఇటీవల జూబ్లీహిల్స్ ఎలక్షన్ లో కాంగ్రెస్ అంటేనే ముస్లిం ముస్లిం అంటేనే కాంగ్రెస్ అంటూ మాట్లాడిన నువ్వు ఈరోజు ఏ ముఖం పెట్టుకొని హిందుత్వం మీద విషం చిమ్ముతున్నవో యావత్ తెలంగాణ ప్రజలు గమనిస్తూ ఉన్నారు తస్మాత్ జాగ్రత్త అన్నారు. హిందువులపై, హిందూ దేవి దేవతలపై వెకిలి మాటలు మాట్లాడటం ఈ మధ్య కొంతమందికి ఫ్యాషన్ అయిపోయింది ఇలాంటి వాళ్లకు బుద్ధి చెప్పాలంటే హిందూ సమాజం అంతా ఒక్కటై రేపు జరగబోయే తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని ఈ సందర్భంగా యావత్ హిందూ సమాజం ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును నోట్ల కట్టలతో కొనాలని అడ్డంగా దొరికిపోయిన నీకు తెలంగాణను పరిపాలించడానికి ఏ మాత్రమూ అర్హత లేదు, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. కావున గవర్నర్, రాష్ట్రపతి వెంటనే చోరువ తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాల్సిందిగా కోరుతున్నానన్నారు. మొన్న తిరుపతి దేవుడి గురించి మాట్లాడిన యాంకర్ శివ జ్యోతి మళ్లీ తిరుమల దర్శనానికి రాకుండా ఆధార్ కార్డు ఎలా అయితే బ్లాక్ చేశారో, తెలంగాణలో ఏ గుడిలోకి రాకుండా రేవంత్ రెడ్డి నీ కూడా ఏ ఒక్క దేవాలయనికి కూడా ప్రవేశించకుండా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు.ఇలాంటి చులకన వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి పట్ల యావత్ హిందూ సమాజం తిరుగబడాల్సిన అవసరం ఉన్నది. ఇలాంటి చౌక బారు మాటలు అపి సాధ్యం కానీదొంగ వాగ్దానలతో గద్దెను ఎక్కిన రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి డైవరషన్ రాజకీయాలతో ప్రజలను మభ్య పెడుతూ ఇంకా టైంపాస్ చేస్తే తెలంగాణ సమాజం, ప్రజలు, హిందువులు రేవంత్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ మంత్రులను ఘోరావ్ చేసే పరిస్థితి తెలంగాణలో రానున్నది. ఒక ముఖ్యమంత్రి స్థానం లో ఉంది, ఒక హిందూవు అయి ఉండి హిందూ దేవతల పట్ల చేసిన ఈ చులకనగ మాట్లాడిన తిరును తెలంగాణ ప్రజల పక్షాన, యావత్ హిందూ సమాజం పక్షాన, బీజేపీ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది అని వన్నాల వెంకటరమణ అన్నారు.

# వెల్దండలో బిజెపి బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మమ్మురంగా ప్రచారం

**వెల్దండ, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ -బిజెపి పొత్తు భాగంగా సర్పంచ్ అభ్యర్థి కానుగుల కన్యాకుమారి, జోగయ్య మిత్రపక్షాల అభ్యర్థిగా బరిలో నిలిచారు.బుధవారం బిఆర్ఎస్, బిజెపి నాయకులు పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అభ్యర్థి కానుగుల కన్యాకుమారి ఇంటింటికీ తిరిగి మమ్మురంగా ప్రచారం నిర్వహించారు. అనంతరం బిఆర్ఎస్ -బిజెపి శ్రేణులు ఊరేగింపుగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో బిజెపి కల్వకుర్తి కాంస్టిట్యుయెన్సీ ఇన్‌చార్జ్ యెన్నం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, వెల్దండ మండల బిజెపి అధ్యక్షులు కురుమిద్ద యాదగిరి, మాజీ





ఎంపీటీసీ జంగయ్య యాదవ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.అదేవిధంగా బిఆర్ఎస్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, వై. చంద్రమోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, మాజీ సర్పంచ్ అరుణ ప్రభాకర్, మండల యూత్ అధ్యక్షులు జంగిలి యాదగిరి, కుడుముల శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగం, జంగిలి ప్రవీణ్, జంగిలి ఆనంద్, నాలుగో వార్డ్ అభ్యర్థి సునీత, బాదేపల్లి గోపాల్, డోల్ మల్లయ్య, టైలర్ వెంకటయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.


# రామడుగు భవిత కేంద్రంలో ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం



**రామడుగు, డిసెంబర్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రామడుగు భవిత కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దివ్యాంగుల ర్యాలీ నిర్వహించగా, అనంతరం ఆటల పోటీలు జరిపారు. మండల విద్యాధికారి రంగనాథ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుండి దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.దివ్యాంగుల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, అసెస్మెంట్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామడుగు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పద్మజ, రత్నాకర్ రెడ్డి, సురేఖ, భవిత కేంద్ర ఉపాధ్యాయులు తిరుమల వెంకటేశ్వర్ రావు, సుధాకర్ పాల్గొన్నారు.

# వనస్థలిపురం లో శత్రు జయాన్ని కలిగించే హనుమద్ వ్రతం

**బొడ్ల మల్లికార్జున్**





**ఎల్బీనగర్ డిసెంబర్ 03(నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
వనస్థలిపురం రెడ్ వాటర్ దగ్గర ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో బుధవారం శ్రీ హనుమద్ వైభవం వ్రతం భక్తిశ్రద్ధలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం కమిటీ చైర్మన్ వేముల జయారాములు ఆధ్వర్యంలో వేదపండితులు ఘనంగా నిర్వించారు. ఈ సంధ్బంగా తెలంగాణ రాష్ట్ర హిందూ ధర్మప్రచార సమితి కార్యదర్శి బొడ్ల మల్లికార్జున్ మాట్లాడుతూ... శ్రీ హనుమద్ వైభవం వ్రతం అనేది హనుమంతుడిని పూజించే ఒక వ్రతం. దీనిని మార్గశిర మాసంలోని శుక్ల పక్ష త్రయోదశి నాడు ఆచరిస్తారు. ఈ వ్రతం కార్యసిద్ధిని, కార్యసాధనను ఇస్తుందని నమ్మకం. ఈ వ్రతంలో శ్రీకృష్ణుడు ద్రౌపదికి బోధించాడు, దీని వలన పాండవులకు సంపద లభించింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం కమిటీ చైర్మన్ వేముల జయారాములు భక్తులు పాల్గొన్నారు.

# మొదటి రోజు 14మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు



**యాచారం, డిసెంబర్ ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
రంగారెడ్డి జిల్లాలో యాచారం మండలం గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైం ది. నామినేషన్ల స్వీకరణకు ఆయా గ్రామ పంచాయతీల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ను అభ్యర్థుల నుంచి స్వీకరించారు. యాచారం మండల పరిధిలోని గ్రామ పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో మొదటి రోజు నామినేషన్లు స్వీకరణ మొదలయ్యిది . యాచారం ఎంపీడీవో రాధా రాణి నామినేషన్ల స్వీకరించే క్లస్టర్లను పరిశీలించారు. మండల పరిధిలోని 24 గ్రామపంచాయతీలకు గాను 14,మంది సర్పంచ్ అభ్యర్థులు, 232వార్డు సభ్యుల అభ్యర్థులకు 35 మంది నామినేషన్లు స్వీకర్చినట్లు ఎంపీడీవో తెలిపారు. క్లస్టర్ల వద్ద ఎలాంటి అవాంఛనియ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.